క్లుప్తంగా

అధ్యాపకురాలిగా సౌజన్య సేవలు ప్రశంసనీయం



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వం నుంచి ఉత్తమ అధ్యాపకురాలిగా పురస్కారాన్ని అందుకున్న సౌజన్య విద్యాసేవలు ప్రశంసనీయమని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి. సునీత పేర్కొన్నారు. జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ఉత్తమ అధ్యాపకురాలిగా పురస్కారాన్ని అందుకున్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆంగ్ల అధ్యాపకురాలు డాక్టర్ భూమిరెడ్డిగారి సౌజన్యను బుధవారం సాంబశివపేటలోని కళాశాలలో అధ్యాపక బృందం సత్కరించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ విజయవాడలో ఈనెల 11న జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ నుంచి సౌజన్య పురస్కారాన్ని అందుకోవడం కళాశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. అధ్యాపకులు సీహెచ్. పద్మ, అనురాధ, కె.పద్మ, కె. విజయ, బి. జయశీల పాల్గొన్నారు.


మహిళ ఆత్మహత్య


లక్ష్మీపురం: భర్త మందలించడంతో మనస్తాపం చెంది వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకులవారితోట ప్రాంతానికి చెందిన షేక్ గౌసియా(32), ఖాదర్ వలి భార్యాభర్తలు. ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. భార్యాభర్తలు అదే ప్రాంతంలో కూరగాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో గొడవ పడుతున్నారు. ఈ క్రమంలో బుధవారం ఖాదర్ వలి భార్య గౌసియా మందలించి కొట్టడంతో ఫ్యానుకు ఉరి వేసుకుంది. స్థానికులు గమనించి ఆసుపత్రికి తరలించే క్రమంలో దారి మార్గంలో మృతి చెందింది. గౌసియా తల్లి కరీమున్ భర్త ఖాదర్ వలిపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సమగ్రాసుపత్రికి తరలించారు.

వామ్మో... 'భయా'బెటిస్ !

- మగర్ బారిన పిల్లలు, యువత
- ఆధునిక జీవన శైలితో పెరుగుతున్న బాధితులు
- ముందస్తు జాగ్రత్తలతో వ్యాధి నివారణ
- నేడు వరల్డ్ డయాబెటిస్ డే

ఆధునిక శైలి.. ఆరోగ్యమే బలి





గుంటూరు మెడికల్: నేడు చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ఆధునిక జీవనశైలి వల్ల పలువురు షుగర్ వ్యాధి బారిన పడుతున్నారు. ఆరోగ్యపరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ వ్యాధి వల్ల యువత శక్తి నిర్వీర్యమవుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం 1980లో ప్రపంచ వ్యాప్తంగా షుగర్ బాధితులు 108 మిలియన్లు ఉంటే, 2024 నాటికి ఈ సంఖ్య 422 మిలియన్లకు చేరింది. ప్రతి ఏడాది షుగర్ వ్యాధితో 1.5 మిలియన్ల మరణాలు సంభవిస్తున్నాయి. ఇవి 2000- 19 మధ్య కాలంలో మూడు శాతం పెరిగాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రతి ఒక్కరూ మధుమేహంపై అవగాహన కలిగి, తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవచ్చు. దీని కోసం ప్రతి ఏడాది నవంబర్ 14న ప్రపంచ డయాబెటిస్ డే నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

వ్యాధికి కారణాలు

మధుమేహం రావడానికి ప్రధాన కారణం ఇన్ఫెక్షన్లు. శరీరంలో ప్యాంక్రియాస్ అనేది ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇన్ఫెక్షన్ వల్ల ప్యాంక్రియాస్ దెబ్బతిని ఇన్సులిన్ ఉత్పత్తి కాకపోవడంతో వ్యాధి సోకుతుంది. పుట్టుకతో వచ్చే జన్యుపరమైన కారణాలు, జంక్ ఫుడ్, వ్యాయామం లేకపోవడం, బరువు పెరగడం, స్థూలకాయం, మానసిక ఒత్తిడికి గురవ్వడం వల్ల కూడా ఈ వ్యాధి సోకుతుంది. తరచుగా మూత్ర విసర్జన, దాహం వేయడం, ఆకలి పెరగటం, బరువు తగ్గిపోవటం, నీరసం, పిల్లలు రాత్రి వేళల్లో పక్కతడపటం వంటివి లక్షణాలు. పిల్లల్లో వీటిని గమనిస్తే వైద్యులను సంప్రదించాలి. జీవితాంతం పిల్లలకు ఇన్సులిన్ వాడాలి. పెద్దవారిలో షుగర్ వ్యాధి సోకితే బాగా దాహం వేసినట్లు ఉంటుంది. తరచుగా మూత్రానికి వెళ్లడం, చూపు మసకబారడం, బాగా అలసట, అతిగా దాహం వేయడం, కొంత మందిలో శృంగార కోరికలు తగ్గడం, కాళ్లలో స్పర్శ లోపించడం, తిమ్మిర్లు రావడం, అతిగా ఆకలి, అకస్మాత్తుగా బరువు తగ్గడం, ఆయాసం, వాంతులు, విరోచనాలు, మర్మాయవాల వద్ద ఇన్ఫెక్షన్స్ వంటి లక్షణాలు కనిపిస్తాయి.

జిల్లాలో బాధితులు ఎక్కువే..

జిల్లాలో 50 మంది షుగర్‌వ్యాధి నిపుణులు, 120 మంది పిల్లల వైద్య నిపుణులు ఉన్నారు. ప్రతి నెలా ఒక్కో వైద్యుడి వద్దకు మూడు నుంచి ఐదుగురు పిల్లలు మధుమేహ వ్యాధితో చికిత్స కోసం వస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎన్‌సీడీ కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా 2023-24లో సర్వే చేశారు. జిల్లా జనాభా 20,14,094 కాగా, వీరిలో 1,12,319 మంది పెద్దవారు మధుమేహంతో బాధపడుతున్నట్లు తేలింది.

వీరి పిల్లలకు షుగర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్న దృష్ట్యా ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించి తగు జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా వ్యాధి బారిన పడకుండా కాపాడవచ్చు.

జాగ్రత్తలు తీసుకోవాలి



జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మధుమేహం రాకుండా నివారించవచ్చు. కుటుంబంలో ఒకరికి వ్యాధి ఉంటే తక్షణమే వైద్యులను సంప్రదించాలి. అవసరమైన పరీక్షలు చేయించుకోవాలి. శరీర బరువును అదుపులో ఉంచుకోవాలి. రోజూ శారీరక వ్యాయామం చేయాలి. నిర్ణీత వేళకు పోషకాహారం, మితాహారం తీసుకోవాలి. ఫాస్ట్‌ఫుడ్స్‌ను, ఒత్తిడిని దరిచేరనీయవద్దు. సరిపడా నిద్ర ఉండాలి. నూనె వస్తువులు, ఉప్పు తగ్గించి తీసుకోవాలి. స్వీట్లు, కూల్ డ్రింక్స్, చాక్లెట్లు, ఐస్‌క్రీమ్స్ వంటివి ఎక్కువ తినకూడదు. ఆకుకూరలు, కూరగాయలు బాగా తీసుకోవాలి.

– డాక్టర్ వీవీ రామ్‌కుమార్, మధుమేహ వ్యాధి నిపుణులు, గుంటూరు

షుగర్‌తో మూత్రపిండాలకు నష్టం



దేశంలో షుగర్ వ్యాధి బాధితులు 100 మిలియన్ల మంది ఉంటే ప్రీ డయాబెటిస్ అంటే రాబోయే మూడు నుంచి ఐదేళ్లలో వ్యాధి వచ్చే అవకాశం ఉన్నవారు 150 మిలియన్ల మంది ఉన్నారు. షుగర్‌తోపాటుగా 100 మందిలో 30 మందికి అధిక రక్తపోటు (హైబీపీ) ఉంది. ప్రీ డయాబెటిస్ వారు అవగాహన కలిగి తగిన జాగ్రత్తలు పాటిస్తే వ్యాధి దరి చేరదు. డయాబెటిస్‌తో కిడ్నీలు కూడా దెబ్బ తింటాయి. హార్ట్ ఎటాక్ , బ్రెయిన్ స్ట్రోక్ కూడా వస్తోంది. కంటి చూపు కోల్పోతారు. శరీరంలోని ఇతర శరీర అవయవాలు దెబ్బ తిని ప్రాణాపాయం సంభవిస్తుంది. ప్రతి ఒక్కరు ముందస్తుగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుని, వైద్యుల సలహాలు పాటించాలి.

– డాక్టర్ చింతా రామకృష్ణ, సీనియర్ నెఫ్రాలజిస్టు, గుంటూరు.

నేటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

గుంటూరు ఎడ్యుకేషన్: బృందావన్ గార్డెన్స్ కుందుల రోడ్డులోని మహిళా బాలల గ్రంథాలయంలో గురువారం నుంచి ఈనెల 20 వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారులు బి. శకుంతల, బి. సత్య శిరీష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా ఈనెల 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖ వ్యక్తుల గురించి ప్రసంగాలు, 17న కవి సమ్మేళనం, 18న విద్యార్థులకు వక్తృత్వ, చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్ పోటీలు, 19న మహిళా దినోత్సవం సందర్భంగా రంగవల్లికలు, అల్లికలు, మెహందీ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈనెల 20న డిజిటల్ గ్రంథాలయంపై విద్యార్థులకు అవగాహనతో పాటు 'చదువు అంటే మా కిష్టం'పై పాఠకులకు, విద్యార్థులకు అవగాహన కల్పించి, ముగింపు ఉత్సవం, బహుమతి ప్రదానోత్సవం గావిస్తామని వివరించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో పాఠకులు, అన్ని వర్గాల ప్రజలు, విద్యార్థులు పాల్గొనాలని వారు కోరారు.

రోడ్డు భద్రత నియమాలను కచ్చితంగా పాటించాలి

నెహ్రూనగర్: రోడ్డు భద్రత నియమాలను కచ్చితంగా పాటించాలని ఆర్టీసీ ఆర్‌ఎం ఎం. రవికాంత్ తెలిపారు. గుంటూరు పార్లమెంట్ పరిధిలో హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ స్కూలులో శిక్షణ పొందుతున్న 17వ బ్యాచ్ అభ్యర్థులకు బుధవారం ఆయన దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని, డ్రైవింగ్ చేసే సమయంలో సమయస్ఫూర్తిగా వ్యవహరించాలని తెలిపారు. డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్‌కే అబ్దుల్‌సలాం వాహనంలోని విభాగాలు, వాటి పనితీరు, వివిధ రకాల రోడ్లు, సిగ్నల్ గురించి వివరించారు. ఘాట్ రోడ్డుల్లో భయం లేకుండా నడిపేందుకు శిక్షణతో పాటు పలు సూచనలు తెలియజేశారు.

వ్యక్తి దారుణ హత్య

- గుంటూరు గుజ్జనగుండ్ల సెంటర్లో ఘటన
- ఓ టెంట్ హౌస్ వద్ద అరుగుపై పడుకుని ఉండగా దారుణం
- టెంట్ హౌస్ యజమానికి ఫైనాన్స్ ఇచ్చిన మృతుడు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన పట్టాభిపురం పోలీసులు



గౌస్ మృతదేహం

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్) : గుంటూరు గుజ్జనగుండ్ల సెంటర్లో టెంట్ హౌస్ వద్ద ఫుట్ పాత్‌పై నిద్రిస్తున్న వ్యక్తి మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. షేక్ గౌస్ (60) గతంలో గుజ్జనగుండ్ల ప్రాంతంలో నివాసం ఉండేవాడు. గౌస్‌కు ముగ్గురు సంతానం. కుమార్తెలిద్దరూ రొంపిచర్ల, విప్పర్ల గ్రామాల్లో ఉంటారు. కుమారుడు నరసరావుపేటలో సమోసాలు అమ్ముతూ జీవిస్తున్నాడు. గౌస్ నగరంలోని కొంతమందికి సుమారు రూ.4 లక్షల వరకు వడ్డీకి ఇచ్చాడు. వచ్చిన వడ్డీతో జీవనం సాగిస్తున్నాడు. కొద్దికాలం పాటు గౌస్ నరసరావుపేటలోని కొడుకు వద్దే ఉన్నాడు. తండ్రీకొడుకుల మధ్య చిన్నపాటి వివాదం జరగడంతో కుమారుడి వద్ద నుంచి అలిగి రొంపిచర్ల మండలం విప్పర్లలో ఉండే కుమార్తె వద్దకు వెళ్లి ఉంటున్నాడు. గౌస్ గతంలో గుజ్జనగుండ్లలోని టెంట్ హౌస్ యజమాని శ్రీనుకు రూ.2 లక్షలు వడ్డీకి ఇచ్చాడు. ప్రతినెలా వచ్చి వడ్డీ డబ్బులు కుమార్తెకు ఫోన్ పే చేయించుకుని వెళ్తుంటాడు.

40 రోజుల క్రితం గుంటూరు వచ్చి ..

ఈ నేపథ్యంలో వడ్డీ డబ్బుల కోసం అని 40 రోజుల క్రితం గుంటూరు వచ్చిన గౌస్ మళ్లీ విప్పర్ల వెళ్లలేదు. టెంట్ హౌస్ శ్రీనును వడ్డీ డబ్బులు అడుగుతూ టెంట్ హౌస్ ముందర ఉన్న ఫుట్ పాత్‌పైనే నిద్రపోతున్నాడు. వడ్డీలు రావల్సిన వారి నుంచి వసూలు చేసుకుని అతని వద్దనే ఉంచుకున్నాడు. మంగళవారం రాత్రి కూడా టెంట్ హౌస్ ముందరే పడుకున్నాడు. ఉదయమే స్థానికులు రక్తపుమడుగులో పడి ఉన్న గౌస్‌ను గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని హత్య జరిగినట్టు నిర్ధారించుకుని విచారణ చేపట్టారు. అనుమానితులైన టెంట్‌హౌస్ యజమానిని, మరి కొందరిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న క్లూస్ టీమ్ ఘటనా స్థలానికి చేరుకుని పలు కీలకమైన ఆధారాలను సేకరించింది. పట్టాభిపురం పోలీసులు సీసీ ఫుటేజ్‌లు పరిశీలిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న మృతుడి కుమార్తె ఘటనా స్థలానికి చేరుకుని కన్నీటి పర్యంతమైంది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గౌస్ మృతదేహాన్ని ప్రభుత్వ సమగ్రాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఇదిలా ఉంటే గంజాయి రవాణా, చోరీలు, పేకాట శిబిరాలు, హత్యలు, హత్యాయత్నాలు యథేచ్ఛగా జరుగుతున్నా.. పోలీసులు నైట్‌బీట్లపై దృష్టిపెట్టడం లేదు. నైట్ బీట్ లేకపోవడం వల్లే నేరాలు పెరిగిపోతున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు.

ఐక్యతే ఆయుధంగా ముందుకెళ్దాం

- గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గాలు దిక్సూచిగా మారాలి
- ఐదు నెలల్లోనే కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత
- పేదల ఆర్తనాదాలు ఆగాలంటే మళ్లీ వైఎస్. జగన్ రావాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, ముఖ్యనేతలు



గుంటూరు పశ్చిమ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఐక్యతే ఆయుధంగా, విజయమే లక్ష్యంగా ముందుకెళ్దామని మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం సాయంత్రం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. మిర్చి యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ గత ఎన్నికల ముందు జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుందామన్నారు. ఐక్యంగా కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఇప్పటికే ఐదు నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు పూర్తి చేశామని చెప్పారు. మిగతా రెండు నియోజకవర్గాల సమావేశాలు త్వరలో నిర్వహిస్తామని వివరించారు. ఏడు నియోజకవర్గాల సమన్వయకర్తలతో సమన్వయం చేసుకుని ముందుకు వెళ్దామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియాపై కూటమి ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు అణిచివేత ధోరణి అవలంబిస్తున్నారని ధ్వజమెత్తారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌పై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని, టీడీపీ కార్యాలయం దాడి కేసులంటూ, పార్టీలో చురుగ్గా పనిచేసే కార్యకర్తలను, నాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని మండిపడ్డారు. ఎక్కడ అణిచివేత ఉంటే అక్కడ తిరుగుబాటు వస్తోందని చెప్పారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని, ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదని ఆరోపించారు. గుంటూరు ఈస్ట్, వెస్ట్ రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గాలుగా మారాలని చెప్పారు. పోరాట పటిమ కనబర్చాలని, దిక్సూచిగా ఉండాలని సూచించారు.

కష్టపడేతత్వం కార్యకర్తల సొంతం

మాజీ మంత్రి, చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని మాట్లాడుతూ గత ఎన్నికల్లో కార్యకర్తలు ఎంతగానో కష్టపడ్డారని కొనియాడారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఈసారి గెలుపు బావుటా ఎగరేయాలని చెప్పారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ 95 శాతం మంది నాయకులు, కార్యకర్తలు సమావేశాలకు వస్తున్నారని, ఇది గొప్ప విషయమని పేర్కొన్నారు. ఏపీలో వైఎస్సార్‌సీపీకి 40 శాతం ఓటింగ్ ఉందని, అన్ని వర్గాల ప్రజలు మన పక్షానే ఉన్నారని చెప్పారు. మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానాలను అమలు చేయలేక, వైఎస్సార్ సీపీని నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. పల్నాడు,గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గాల పార్టీ పరిశీలకులు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల ఆర్తనాదాలు ఆగాలంటే మాజీ సీఎం వైఎస్ జగన్ మళ్లీ అధికారంలోకి రావాలని పేర్కొన్నారు. పార్టీ నగర అధ్యక్షుడు, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు (డైమండ్ బాబు) మాట్లాడుతూ పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరం కష్టపడి పనిచేద్దామని చెప్పారు. సమావేశంలో డివిజన్ కార్పొరేటర్లు, ఇన్‌ఛార్జ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలావతి



గుంటూరు ఎడ్యుకేషన్: మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి సూచించారు. బ్రాడీపేటలోని మాస్టర్ మైండ్స్ క్యాంపస్‌లో బుధవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా లీలావతి మాట్లాడుతూ మహిళా చట్టాలు, పోక్సో యాక్ట్ గురించి వివరించారు. న్యాయ సహాయం అవసరమైన వారికి దాన్ని త్వరితగతిన అందించే విధంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కృషి చేస్తోందని తెలిపారు. యువతపై మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల ప్రభావం ఎక్కువగా ఉందని, వాటిని వాడటం చాలా ప్రమాదకరమని తెలిపారు. విద్యార్థులకు సరైన అవగాహన లేకపోవడం వల్ల మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అపరిచిత వ్యక్తుల దగ్గర ఎటువంటి పదార్థాలను తీసుకోరాదని విద్యార్థులకు సూచించారు. విద్యార్థినులు సైతం ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా భవిష్యత్తుపైనే దృష్టి సారించాలని ఆమె తెలిపారు. డ్రగ్స్ కేసులో పట్టుబడితే కఠిన శిక్షలు ఉంటాయని, భవిష్యత్తు నాశనం అవుతుందని స్పష్టం చేశారు. భారతీయ న్యాయ సంహిత వంటి కొత్త చట్టాల గురించి ప్యానెల్ అడ్వకేట్ కట్టా కాళిదాసు వివరించారు. ర్యాగింగ్ నివారణ కోసం చేపట్టాల్సిన చర్యలను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో మాస్టర్‌మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గాయని సుశీల జన్మదిన వేడుకలు



లక్ష్మీపురం: అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం ప్రముఖ సినీ గాయని పి.సుశీల జన్మదిన వేడుకలు నిర్వహించారు. గాయని యార్లగడ్డ లక్ష్మి కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ భాషల్లో అత్యధిక పాటలు పాడిన వ్యక్తిగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు చేసుకున్న సుశీల గాయనీ గాయకులందరికీ స్ఫూర్తి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సాంస్కృతిక కార్యక్రమాల కోఆర్డినేటర్ బిళ్లా అశోక్, వెంకాయమ్మ, సంస్థ సీనియర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నగర ప్రజల సొంతింటి కల నెరవేర్చాలి

లక్ష్మీపురం: నగరంలో పేదలందరికీ రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్ల స్థలం ఇవ్వాలంటూ సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలో 17వ డివిజన్‌లో బుధవారం పేదలందరికీ ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలంటూ కరపత్రాలు, ప్రజలకు దరఖాస్తు ఫారాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. నగర ప్రజల సొంతింటి కల నెరవేర్చాలని డిమాండ్ చేశారు. 17వ డివిజన్ పరిధిలోని అమీనా నగర్, కమ్మ శేషయ్య గ్రౌండ్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. కార్యక్రమంలో నగర కమిటీ సభ్యుడు చినబోతుల విజయ్ కుమార్, సమితి సభ్యులు, సీనియర్ నాయకులు నూతలపాటి వెంకటేశ్వరరావు, ఏఐవైఎఫ్ నగర అధ్యక్షుడు చెనబోతుల శ్రీనివాసరావు, దేవరకొండ భాగ్యలక్ష్మి, తోకల రోజా, దేవరాజు, కోటి, ఫాతిమా, మస్తాన్‌బీ పాల్గొన్నారు.

నమ్మి ఓట్లేస్తే వేధిస్తారా!

- కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతాం
- బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): నమ్మి ఓట్లు వేస్తే ఇప్పుడు బ్రాహ్మణులను వేధింపులకు గురి చేస్తారా? బ్రాహ్మణులపై వేధింపులకు దిగితే కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నామని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు సిరిపురపు శ్రీధర్ శర్మ ఘాటుగా స్పందించారు. గుంటూరు నగరంలో రౌడీ షీటర్ బోరుగడ్డ అనిల్‌కుమార్‌కు పోలీస్ రాచ మర్యాదల అంశంలో తప్పు చేసిన పోలీసులపై ఇప్పటి వరకు ఒక కేసు కూడా నమోదు చేయకుండా, పోలీసుల తప్పులను ఎత్తి చూపిన బ్రాహ్మణ టెక్నీషియన్ బృగుబండ శేషగిరిరావు(శేషు)ను నాలుగు రోజుల నుంచి అజ్ఞాతంలో దాచి పెట్టడాన్ని శ్రీధర్ ఖండించారు. బుధవారం బ్రాడీపేటలోని సంఘ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పోలీసు వ్యవస్థ దిగజారి వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. పోలీసుల వైఫల్యాలను ఎత్తిచూపిన వారిపై కేసులు పెట్టడం తగదని పేర్కొన్నారు. బ్రాహ్మణ యువకుడిని కాపాడుకునేందుకు చట్టపరంగా ముందుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ నేతలు వావిలాల రామ్ కుమార్ శర్మ, పెద్దింటి కృష్ణ చైతన్య శర్మ, రామరాజు సుధాకర్ శర్మ, ఐలూరి సంపత్ కుమార్, చిలుమూరు ఫణి శర్మ, న్యాయవాది ఎండపల్లి శరత్, వడ్లమూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.